క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో యశ్వంత్ ప్రతిభ



శావల్యాపురం: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శావల్యాపురానికి చెందిన జక్కా యశ్వంత్ తేజ 99.21 శాతం మార్కులు సాధించినాడు. జక్కా నాగ శ్రీనివాసరావు, భావనల పెద్ద కుమారైన అతడు ప్రాథమిక విద్యతో పాటు పదో తరగతి వరకు శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో చదివాడు. ఇంటరును గుంటూరులోని భాష్యం క్యాంపస్‌లో చదువుతూ జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరయ్యాడు. ఫలితాల్లో ప్రతిభ చూపిన యశ్వంత్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు, తహసీల్దారు నక్కా లక్ష్మీ లావణ్య, ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి, ఎంఈవోలు మద్దికుంట సాంబశివరావు, పుసులూరి లలితాకుమారి, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డడ్డపాటి విజయలక్ష్మి అభినందించారు.

17న ఇంటింటికీ కుళాయి పథకం ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరులో ఈనెల 17న ఇంటింటికీ కుళాయి పథకాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూఢవత్ ఆకాష్ బుధవారం తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ. కోటి వ్యయంతో గ్రామంలో మొదట విడతలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో 700 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏబీసీ కెనాల్ నుంచి వయా రైల్వే ట్రాక్ మీదగా మంచినీటి చెరువు వరకు 1800 మీటర్ల సిమెంటు పైపుల నిర్మాణం కూడా పూర్తి చేశామని తెలిపారు. రైల్వే అధికారులు అనుమతి కోసం నగదు చెల్లింపులు కూడా చేశామని, వారి నుంచి అనుమతులు రాగానే అద్దంకి బ్రాంచి కెనాల్ నుంచి సిమెంటు పైపుల ద్వారా సాగర్ జలాలు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రస్తుతానికి గ్రామస్తులకు తాగునీటి సమస్య లేకుండా మోటార్ల ద్వారా మంచినీటి చెరువులోకి సాగర్ జలాలు నింపినట్లు చెప్పారు. ఆయనతో పాటు సచివాలయ ఇంజినీరు రంతు లక్ష్మణ్ ఉన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార బుధవారం తెలిపారు. ఇస్సప్పాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు చెప్పారు. అక్రమంగా మద్యం కలిగిఉన్న ఎస్.లక్ష్మిని అరెస్టు చేసి, 15 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితురాలిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

20న నూజెండ్ల మండల సర్వసభ్య సమావేశం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 10గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. మండలంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమా ల అమలుపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌కు జై భారత్ విద్యార్థి


షేక్ రయ్యాన్

క్రోసూరు: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ఎగ్జిబిషన్‌కు క్రోసూరుకు చెందిన జై భారత్ స్కూల్ విద్యార్థి షేక్ రయ్యాన్ ఎంపికైనట్లు ఆ పాఠశాల డైరెక్టర్ టి.జైనేంద్రరెడ్డి బుధవారం తెలిపారు. నరసరావుపేటలో జరిగిన పల్నాడు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ఎగ్జిబిషన్‌లో జిల్లా వ్యాప్తంగా 126 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. అందులో 13 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయగా, అందులో తమ స్కూల్‌కు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి షేక్ రయ్యాన్ తయారు చేసిన వీడింగ్ మిషన్ (వెద పద్ధతి సాగులో కలుపు నివారణ యంత్రం) అబ్జర్వర్లను ఎంతగానో ఆకట్టుకుందని వివరించారు. పరికర ప్రయోజనాన్ని తెలుసుకుని, మరింత అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ప్రదర్శించేందుకు రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేసినట్లు జైనేంద్రరెడ్డి చెప్పారు. ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రదర్శనలను తిలకించిన జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ షేక్ రయ్యాన్‌ను అభినందిస్తూ మెరిట్ సర్టిఫికెట్, ఇన్‌స్పైర్ మానక్ అవార్డు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తమ పాఠశాల విద్యార్థి బాల శాస్త్రవేత్తగా తయారు కావడానికి ప్రోత్సహించిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు రయ్యాన్‌ను ప్రశంసించారు.

కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

- నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్‌కు అపూర్వ స్వాగతం
- చిలకలూరిపేట సమన్వయకర్త రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- అడుగడుగునా బ్రహ్మరథం
- వందలాది కార్లు, ద్విచక్ర వాహనాలతో కార్యకర్తల సందడి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు


పురుషోత్తమపట్నం వద్ద కారు పైనుంచి అభివాదం చేస్తున్న అనిల్‌కుమార్ యాదవ్, మల్లెల రాజేష్‌నాయుడు


వినుకొండ రోడ్డులో కొనసాగుతున్న ర్యాలీలో పార్లమెంట్ సమన్వయకర్త అనిల్ కుమార్ యాదవ్, విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి.


పోతవరం వద్ద గజమాలతో అనిల్‌కుమార్ యాదవ్, మల్లెల రాజేష్‌నాయుడుకు స్వాగతం

చిలకలూరిపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కదం తొక్కారు. నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్తగా నియమితులై తొలిసారి అధికార పర్యటనలో భాగంగా నరసరావుపేటకు వచ్చిన అనిల్‌కుమార్ యాదవ్‌కు చిలకలూరిపేట ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అడుగడుగునా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. మల్లెల రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో వందలాది కార్లు, ద్విచక్రవాహనాలతో నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా బుధవారం మధ్యాహ్నం మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్దకు చేరుకున్నారు. నెల్లూరు నుంచి రోడ్డు మార్గాన వచ్చిన అనిల్‌కుమార్ యాదవ్ దేవాలయం వద్దకు చేరుకోగానే పార్టీ నాయకులు, కార్యకర్తల ఉత్సాహం అంబరాన్ని అంటింది. జై జగన్... జై అనిల్ కుమార్ యాదవ్... జై మల్లెల రాజేష్‌నాయుడు నినాదాలతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. అక్కడి నుంచి అనిల్ కుమార్ యాదవ్, మల్లెల రాజేష్‌నాయుడు కారుపై నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలకు అభివాదం చేస్తూ భారీ ర్యాలీగా ముందుకు సాగారు. జాతీయ రహదారి వాహనాలతో కిటకిటలాడింది.

అడుగడుగునా గజమాలలతో స్వాగతం

అక్కడి నుంచి పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్ చేరుకోగానే ఇద్దరు నాయకులకు క్రేన్ సహాయంతో 30 అడుగుల గజమాలతో కార్యకర్తలు స్వాగతం పలికారు. అడ్డరోడ్డు సెంటర్ నుంచి పురుషోత్తమపట్నం వరకు యాదవ రాజులు ఏర్పాటు చేసిన ఎడ్లబండిలో అనిల్ కుమార్ యాదవ్, మల్లెల రాజేష్‌నాయుడు ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. మార్గంమధ్యలో మహిళలు పెద్ద ఎత్తున హారతులు పట్టారు.

➡ పురుషోత్తమపట్నంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంకమ్మతల్లి దేవాలయం సెంటర్‌లో తిరిగి క్రేన్ సహాయంతో నాయకులకు గజమాలతో కార్యకర్తలు స్వాగతం పలికారు. అక్కడ గంగమ్మ తల్లి, అంకమ్మతల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

➡ ర్యాలీ మండలంలోని పోతవరం గ్రామానికి చేరుకోగానే, గ్రామస్తులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. డాక్టర్ వైఎస్సార్, మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

➡ మద్దిరాల గ్రామానికి చేరుకున్న నాయకులకు చిలకలూరిపేట ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, నియోజకవర్గంలో మూడు మండలాలకు చెందిన పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.


వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అనిల్ కుమార్ యాదవ్


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అనిల్ కుమార్ యాదవ్

➡ యడవల్లి, కట్టుబడివారిపాలెం గ్రామాలలోని అనిల్‌కుమార్ యాదవ్, మల్లెల రాజేష్‌నాయుడుకు అక్కడి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ స్వాగతం పలికి భారీ గజమాలలతో సత్కరించారు.

➡ యూటీ సెంటర్ దాటి ర్యాలీ కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధికి చేరుకుంది. అక్కడ పార్టీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలసి పూజల్లో పాల్గొన్నారు.

➡ అనంతరం కిక్కిరిసిన వాహన శ్రేణితో ర్యాలీ పెట్లూరివారి పాలెం మీదుగా నరసరావుపేటకు చేరుకుంది. ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీకి భారీగా తరలి వెళ్లిన యడ్లపాడు నేతలు


పార్టీ పతాకాలతో బయలుదేరుతున్న నాయకులు, కార్యకర్తలు

యడ్లపాడు: నరసరావుపేట పార్లమెంటు ఇన్‌చార్జిగా తొలిసారిగా పల్నాడు జిల్లాకు వచ్చిన అనిల్ కుమార్ యాదవ్‌కు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. చిలకలూరిపేట పట్టణంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఏర్పాటు చేసిన భారీ ర్యాలీకు యడ్లపాడు మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. వాహనాలకు పార్టీ జెండాలను కట్టుకొని, నినాదాలు చేస్తూ ఉత్సాహంగా బుధవారం మధ్యాహ్నం బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఘంటా శంకరరావు, జిల్లా కార్యదర్శి రాజమంటి చింతారావు, ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్, నాయకులు కర్నాట సుబ్బారావు, ఊరంగి నాగమల్లేశ్వరావు, షేక్ ఖాదర్‌మస్తాన్, ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, కల్లూరి రామకృష్ణ, బండ్ల పున్నారావు, పాలిష్ బుజ్జి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష శిబిరంలో 406 మందికి వైద్య పరీక్షలు



నరసరావుపేట: పట్టణంలోని ఏడో వార్డు బాబాపేట పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 406మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. జనరల్ మెడిసిన్ డాక్టర్ ప్రత్యూష, జనరల్ సర్జన్ డాక్టర్ నజియా, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జి.హర్షవర్ధనరెడ్డి 224మంది మహిళలు, 183మంది పురుషులు, ఆరుగురు పిల్లలు, ముగ్గురు గర్భిణులకు వైద్య సేవలందించారు. కంటి వెలుగు సిబ్బంది 53 మందికి పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు.

ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లకు సన్మానం



వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో బుధవారం రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ అబ్దుల్ రజాక్ హాజరయ్యారు. మొదటి ముగ్గురు ప్రమాద రహిత డ్రైవర్స్‌కు నగదు బహుమతులు అందజేశారు. జిల్లాస్థాయిలో ప్రమాద రహిత డ్రైవర్‌గా వినుకొండ డిపోకు చెందిన వై.ఎ.రాజు, డిపో స్థాయిలో షేక్ ముస్తఫా, గోవిందునాయక్, లాల్‌సింగ్‌నాయక్‌లు ప్రమాదరహిత డ్రైవర్లుగా బహుమతులు అందుకున్నట్లు డీఎం కోటేశ్వరరావునాయక్ తెలిపారు. అనంతరం డాక్టర్ అబ్దుల్ రజాక్‌తో పాటు ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, వివిధ అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు


పార్టీలో చేరిన వారితో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: అన్ని వర్గాలకు మేలు చేస్తున్న జగనన్న పాలన మెచ్చి టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయని నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు తెలిపారు. యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఆయన సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో లబ్ధి పొందని కుటుంబం అంటూ లేదని వెల్లడించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వ విధానాలపై ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు సైతం ఎందరో ఆకర్షితులు అవుతున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో మరోమారు వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో రాట్నాల పెద్ద సుబ్బారావు, రాటాన్ల వీర సుబ్బారావు, రాట్నాల భావనారాయణ, రాట్నాల సుబ్బారావు, రాట్నాల శ్రీనివాసరావు, రాట్నాల రామయ్య, రాట్నాల వీరాంజనేయులు, రాట్నాల గోపీ, రాట్నాల వెంకట కళ్యాణ్ వారి అనుచరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, యడ్లపాడు మండల పార్టీ అధ్యక్షుడు ఘంటా శంకర్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో సవరణలపై శ్రద్ధ అవసరం

నాదెండ్ల: ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పు చేర్పులపై బీఎల్‌వోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ డి.వి.వి.వరకుమార్ చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలు, వీఆర్వోలు, సూపర్‌వైజర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం ఓటర్ల సంఖ్య 52522 కాగా, ఇందులో పురుషులు 25,604 మంది, స్త్రీలు 26,891 మంది, ఇతరులు 27 మంది ఉన్నట్లు వివరించారు. కొత్త ఓటర్ల జాబితా సిద్ధమైందని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో మృతులు, డబుల్ ఎంట్రీలను గుర్తించి తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మరోసారి ఆదేశాలిస్తే సవరణలు, చేర్పులు మార్పులు చేయాల్సి ఉంటుందన్నారు. అయితే, కొత్తగా వచ్చే ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, ఆర్ఐ రమీజా పాల్గొన్నారు.

పురుగు మందు తాగి కౌలురైతు మృతి



రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కస్తుర్బాగాంధీ బాలికల పాఠశాలకు ఎదురుగా ఉన్న కోల్డ్ స్టోరేజీ వెనుకవైపు మంగళవారం రాత్రి జరిగింది. బ్రాహ్మణపల్లికి చెందిన అచ్చనాల వెంకయ్య(44) మంగళవారం రాత్రి 3 గంటలకు ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరినట్లు బంధువులు తెలుపుతున్నారు. బుధవారం ఉదయం బంధువులు వెతుకుతుండగా కోల్డ్ స్టోరేజీ వెనుక శవమై కన్పించాడు. పక్కన పురుగు మందు బాటిలు ఉన్నట్లు గ్రహించారు. మృతుడు మూడు ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని పత్తి వేసినట్లు స్థానికులు తెలిపారు. అప్పుల బాధ భరించలేక మృతి చెందినట్లు బంధువులు అంటున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు రవి, కుమార్తె దీపిక ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్ఐ సయ్యద్ సమీర్‌బాషా సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైభవంగా ఆలయాల వార్షికోత్సవాలు


అన్నదానం నిర్వహిస్తున్న రామిరెడ్డి


ప్రత్యేక అలంకరణలో స్వామి

నాదెండ్ల: చిరుమామిళ్లలోని నాదెండ్ల బైపాస్ రోడ్డులో కొలువైయున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి, నడికట్టు రామిరెడ్డి ఎస్టీ కాలనీలో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాల ఐదో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వార్లకు పూజారి కె. శంకరశర్మ బృందం ఆధ్వర్యంలో పూజలు, పంచామృతాభిషేకాలు, అష్టోత్తరనామ, గోత్ర నామపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ 2007లో రెండు ఆలయాల్ని సొంత నిధులతో నిర్మించినట్లు తెలిపారు. గతంలో కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం ఆవశ్యకతను గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారని, దీంతో ఆలయాలు నిర్మించినట్లు తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించే ఎస్టీలకు సొంత నిధులతో స్థలాన్ని రిజిస్టర్ చేసి, ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి ఇచ్చానని చెప్పారు. ఈ కాలనీలోనే కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం నిర్మించినట్లు తెలిపారు. తన సంపాదనలో కొంతభాగాన్ని గ్రామ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నానని పేర్కొన్నారు. అనంతరం అన్నదానాన్ని నిర్వహించారు. ఆలయాల వార్షికోత్సవాలతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమాల్ని సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి, గ్రామ పెద్దలు యన్నం శివారెడ్డి, వేమారెడ్డి, దుగ్గెంపూడి రమణారెడ్డి, బ్రహ్మారెడ్డి, మద్దూరి విజయభాస్కరరెడ్డి పర్యవేక్షించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కవితా చౌదరి

శావల్యాపురం: ఉపాధి హామీ పథకంలో రానున్న నాలుగు నెలల వ్యవధిలో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 7,176 మందికి జాబ్ కార్డులు ఉన్నాయని, వారందరికీ పనులు కల్పించే బాధ్యత ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని చెప్పారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలకు చెందిన వారందరికీ వంద రోజుల పని దినాలు కల్పించేలా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. ప్రధానమంత్రి అవాస్ యోజన పథకంలో లబ్ధిదారుల బిల్లులు పెండింగ్‌లో లేకుండా క్షేత్రస్థాయిలో మస్టర్‌ను పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం గ్రామాల వారీగా ఫీల్డ్ అసిస్టెంట్స్ పనితీరుపై సమీక్షించి, సూచనలు చేశారు. సమావేశంలో ఏపీవో ఎం.రామారావు పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రంలో టీవీ చోరీ

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి రైతుభరోసా కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు రూ. 50వేల విలువైన టీవీని మంగళవారం రాత్రి ఎత్తుకు పోయారు. తలుపు తాళాలు పగలికొట్టి చోరీకి పాల్పడినట్లు మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ తెలిపారు. రైతు భరోసా ముఖద్వారం వద్ద కంప్యూటర్ వదిలి వేసినట్లు చెప్పారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ చల్లా సురేష్ పరిశీలించారు. రైతుభరోసా కేంద్ర సహాయకురాలు వరలక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉంటారని, నిందితుల్ని త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.


వైభవంగా వసంత పంచమి


ప్రత్యేక అలంకరణలో శారదాంబ


శంకరమఠంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

నరసరావుపేట ఈస్ట్: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం శ్రీ శృంగేరి శంకరమఠంలోని శ్రీ శారదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పెన్నులతో అలంకరించారు. దాదాపు వందమంది చిన్నారులకు తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించి, పలకలు, బలపాలు, పెన్నులు పంపిణీ చేశారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు. శంకరమఠం మేనేజర్ కె.వి.కె. నాగరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో 15మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాలలో శ్రీ గాయత్రి యజ్ఞం నిర్వహించారు. పాఠశాల అధ్యక్షుడు మిరియాల నాగ ప్రసాదరావు, పి.వి.ఆర్. ప్రసాదరావు, రత్నాకరం రాము, ప్రిన్సిపాల్ ఆర్.బాలభవాని పాల్గొన్నారు.


వేళ్ల సహా ఒరిగిన వేప చెట్టు (ఫైల్)


కొత్త చిగురులతో చెట్టు

ఒరిగిన చెట్టే చిగురించేనే...

మండలంలోని బొప్పూడి నాగేంద్రస్వామి పుట్ట దగ్గర సుమారు 16 సంవత్సరాల వయస్సు వేప చెట్టు గత సంవత్సరం జులైలో వర్షాలకు, గాలులకు పక్కకు ఒరిగింది. వృక్ష సంపదను కాపాడుకోవాలన్న ఉద్దేశంతో గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన వారు గ్రామస్తుల సహకారంతో వేళ్ల సహా పక్కకు ఒరిగిన వేపచెట్టును ఆధునిక సాంకేతికతో యథాస్థానంలో తిరిగి నాటారు. ఏడునెలలకు పూర్తిగా నిలదొక్కుకొని మునిపటి వలే నీడనిస్తోంది.

– చిలకలూరిపేట టౌన్

'స్వమిత్వా' సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామ సచివాలయంలో బుధవారం గ్రామాల్లో మెరుగైన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన స్వమిత్వా (సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ) సర్వే మ్యాపింగ్‌పై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ నక్కా లక్ష్మి లావణ్య మాట్లాడుతూ గ్రామాల్లో మెరుగైన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సర్వే మ్యాపింగ్ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. స్వమిత్వా సర్వేలో భాగంగా నివాస గృహాలు, ఇళ్లు, ఖాళీ స్థలాలు, దొడ్లను పారదర్శకంగా స్వమిత్వ సర్వే చేసినట్లు చెప్పారు.ఎవైనా అభ్యంతరాలు ఉంటే సత్వరమే సమగ్ర ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.ఇంటి యజమాని పాస్‌ఫోర్ట్ ఫొటో, ఆధార్ కార్డు నకలును సచివాలయాల్లో త్వరతిగతిన అందజేయాలని కోరారు. అనంతరం స్వమిత్వ రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.గ్రామసభలో సర్పంచ్ తిరివిధి శివకుమారి, వీఆర్వో అమల, పంచాయతీ కార్యదర్శి మంద్రు మనోహర్, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

